
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

గురువారం 9 జనవరి 2025

నేడు మద్దూరులో ప్రజావేదిక

మద్దూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకంపై నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రామ్మోహన్ తెలిపారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 31, 2024 వరకు చేపట్టిన వివిధ పనులపై వీఆర్పీలు గ్రామాల్లో నిర్వహించిన 16వ సామాజిక తనిఖీ పూర్తయిందని, ఉదయం 10 గంటలకు నిర్వహించే ప్రజావేదికకుజిల్లా అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు.

మున్సిఫ్‌కోర్టు భవనం పరిశీలన

- పనుల పురోగతిపై సూచనలిచ్చిన కలెక్టర్ మనుచౌదరి, న్యాయమూర్తి సాయిరమాదేవి

చేర్యాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మున్సిఫ్‌కోర్టు సేవలు త్వరలో ప్రారంభించనున్న నేపథ్యంలో సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, జిల్లా న్యాయమూర్తి సాయి రమాదేవి బుధవారం సాయంత్రం సంబంధిత ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కోర్టు కార్యాలయ ఆవరణ, ఫర్నిచర్ ఏర్పాటు, పార్కింగ్, ఫ్లోరింగ్, టాయిలెట్లు, తాగు నీటి వసతి, ఇతరత్రా పనుల పురోగతిని పరిశీలించి పలు సూచనలు చేశారు. పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈనెల 11న కోర్టు భవనాన్ని సిద్దిపేట జిల్లా అడ్మినిస్ట్రేటివ్ హైకోర్ట్ జడ్జి విజయసేన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ విషయమై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీహరి, స్థానిక అధికారులు పాల్గొన్నారు.



కోర్టు హాల్‌లో న్యాయమూర్తి కుర్చీని పరిశీలిస్తున్న జడ్జి సాయిరమాదేవి

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి నిర్మలాజగ్గారెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం

- రైతు భరోసాను రూ.12 వేలకు పెంచి రైతు పక్షపాతినని నిరూపించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గే నాయకత్వంలో సీఎం, మంత్రులు తీసుకున్న నిర్ణయం హర్షణీయం
- సంగారెడ్డిలో రైతు సంబురాల్లో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గేల నాయకత్వంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేబినెట్ మంత్రులు రైతు భరోసాను రూ.12 వేలకు పెంచాలని తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని రోడ్లు భవనాలశాఖ అతిథిగృహంలో బుధవారం టీజీఐఐసీ చైర్ పర్సన్, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని మారోసారి నిరూపితమైందన్నారు. రైతు భరోసా 12 వేలకు పెంచినందుకు రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఆంజనేయులు, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్‌నాయక్, సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సదాకుల కుమార్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోపాజి అనంతకిషన్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సదాశివపేట, కంది మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు సిద్దన్న, మోతీలాల్‌నాయక్, సదాశివపేట పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కూన సంతోష్, నాయకులు వెంకట్, చిత్తారి యాదగిరి, కసిని రాజు, కిష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



సంగారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రేపటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్!

- బకాయిలు చెల్లించాలని సర్కారుకు డిమాండ్
- ఉమ్మడి జిల్లాలో 28 నెట్‌వర్క్ ఆస్పత్రులు

సంగారెడ్డిఅర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించిన ప్రైవేటు ఆస్పత్రులకు సర్కారు బకాయి ఏర్పడడంతో సేవలు నిలిపి వేయాలని నెట్‌వర్క్ ఆస్పత్రులు నిర్ణయించాయి. ఇప్పటికే ఆరోగ్యశ్రీ ఉన్నతాధికారులకు నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు లేఖ ద్వారా సమాచారం చేరవేశారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడంతో ఈనెల10 నుంచి వైద్య సేవలు నిలిపివేయాలని యాజమాన్యాలు నిర్ణయించాయి. ఓపీతో పాటు ఐపీ సేవలు అందించబోమని తేల్చిచెబుతున్నారు. ఏడాది కాలంగా పెండింగ్ ఉన్న బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు కోరుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 28 నెట్‌వర్క్ (ప్రైవేటు)ఆస్పత్రులున్నాయి. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు నిలిపేస్తే ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందేందుకు వచ్చే రోగులకు ఇబ్బందులు ఏర్పడనున్నాయి.

ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చిన భార్య

- ఉత్తర్‌పల్లి హత్య కేసు ఛేదన
- వివరాలు వెల్లడించిన సంగారెడ్డి రూరల్ పోలీసులు

7

రైతు భరోసాకు సర్వం సిద్ధం!

- మార్గదర్శకాలే తరువాయి...
- జిల్లాలో యాసంగి అంచనా 3.51 లక్షల ఎకరాలు
- ఇప్పటివరకు 2.49 లక్షల ఎకరాల్లో సాగు

దుబ్బాక, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పెట్టుబడి సాయం కోసం ప్రభుత్వం అందించే రైతు భరోసాపై ఉత్కంఠ నెలకొన్నది. సాగు భూములకే భరోసా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో మార్గదర్శకాల కోసం రైతులు, వ్యవసాయ అధికారులు ఎదురుచూస్తున్నారు. సాగు భూములను గుర్తించి, నివేదికను సిద్ధం చేసుకోవాల్సిందిగా ప్రభుత్వం జిల్లా యంత్రాగాన్ని ఇప్పటికే ఆదేశించింది. మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లా అధికారులతో పాటు వివిధ జిల్లాల అధికారులతో, కలెక్టర్లతో రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్ సమీక్ష నిర్వహించారు. సాగు భూమి అవునా? కాదా? నిక్కచ్చిగా తేల్చాలని సూచించారు. సాగుభూములను గుర్తించేందుకు క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని, రెవెన్యూ, వ్యవసాయ అధికారుల సంయుక్తంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసి రైతుభరోసా మార్గదర్శకాల కోసం ఎదురుచూస్తుంది.



7.19లక్షల ఎకరాలే..

ఇప్పటికే అటవీశాఖ, ఆర్‌అండ్‌బీ, నీటిపారుదలశాఖ, పంచాయతీ, పురపాలికశాఖలతో వ్యవసాయశాఖ జిల్లాలో వాణిజ్య, వ్యవసాయేతర భూములను గుర్తించారు. అయితే జిల్లాలో 9లక్షల12వేల947 ఎకరాల భూవిస్తీర్ణం ఉంది. ఇందులో సాగుయోగ్యమైన భూములు 7లక్షల 19వేల 2 ఎకరాలు, సాగు యోగ్యం కాని భూములు 44,152 ఎకరాలు, అటవీభూములు 52,380 ఎకరాలు ఉన్నాయి. గత ప్రభుత్వం సాగుతో పనిలేకుండా ప్రతి రైతుకు రైతుబంధును అందజేసింది. సాగుకు యోగ్యం లేని భూములకు, వాణిజ్య భూములకు కూడా రైతుబంధు అందించారనే ఆరోపణలున్నాయి. జిల్లాలో 6,25,320 ఎకరాలకు 3,24,141 మంది రైతులకు సుమారు రూ.312 కోట్లు ఒక్కోసీజన్‌కు అందజేశారు. ఈసారి ప్రభుత్వం సాగు యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో చాలావరకు భూములుండీ కూడా సాగుచేయని భూములకు భరోసా వర్తించదు. ఈ యాసంగికి 3.51లక్షల ఎకరాల సాగుకు సిద్ధం చేసిన రైతులు ఇప్పటి వరకు సుమారు 2.49 లక్షల ఎకరాలను చదును చేశారు. ఇందులో వరి వర్షాకాలం 3,79,108 ఎకరాలు సాగు కాగా, ప్రస్తుతం 2,16,867 ఎకరాలు సాగు కానున్నది. అందులో దుబ్బాక మండలం వరిసాగులో టాప్‌లో ఉంది. వర్షాకాలంలో 24,800 ఎకరాల వరిసాగైతే, ఈ సారి 18వేల ఎకరాలకు సాగు కొనసాగిస్తున్నారు.

వర్షాధారిత రైతుల పరిస్థితి?

సాగు యోగ్యమైన భూములకే రైతుభరోసా ఇస్తున్నామని ప్రభుత్వం ప్రకటించగా, వర్షాకాలం, యాసంగి పంటలకు సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం లేకపోలేదు. సుమారు 1.40వేల ఎకరాల సాగు

మిగతా 8వ పేజీలో...

30 మంది విద్యార్థులను చితకబాదిన పీడీ

- సడ్డీ అవర్‌కు లేటయ్యారని ఆగ్రహం
- సాంఘిక సంక్షేమ గురుకులంలో ఘటన

కొండపాక, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆలస్యంగా నిద్రలేచారని, స్టడీ అవర్‌కు ఆలస్యంగా వచ్చారని ఆగ్రహంతో ఊగిపోయిన గురుకుల కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సుమారు 30 మంది విద్యార్థులపై ప్రతాపం చూపాడు. దొరికిన వారిని దొరికినట్లు కర్రలతో కొట్టాడు. దీంతో విద్యార్థుల పిరుదులపై వాతలు తేలగా, ఇద్దరు విద్యార్థులను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. బాధతట్టుకోలేక ఓ విద్యార్థి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం చోటుచేసుకుంది. విద్యార్థులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. దుద్దెడ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతితోపాటు ఇంటర్ విద్యార్థులకు ఉదయం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. రోజూ ఉదయం ఆరు గంటలకల్లా విద్యార్థులు స్టడీ అవర్‌కు రావాలని నిబంధన పెట్టుకున్నారు. ఇందులో భాగంగా మంగళవారం వాచ్‌మన్ భరత్ ఉదయం 5 గంటల 20 నిమిషాలకు వచ్చి ఇంటర్ విద్యార్థులను నిద్రలేపారు. ఆలస్యమైందని విద్యార్థుల్లో కొందరు స్నానానికి వెళ్లగా, మరికొందరు గదిలోనే ఉన్నారు. ఈ క్రమంలో స్టడీ అవర్‌కు కొంత ఆలస్యంగా వెళ్లారు. దీంతో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వాసు ఆగ్రహంతో ఊగిపోతూ స్టడీ అవర్‌కు వెళ్తున్న పదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులను వరుసగా నిలబెట్టి దుడ్డుకర్రతో పిరుదులపై, చేతులపై చితకబాదాడు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న 20 మందికి పైగా విద్యార్థులను, పదో తరగతి చదువుతున్న పది మంది విద్యార్థులను కర్రలతో చితకబాదాడు. దీంతో విద్యార్థులకు వాతలు తేలాయి. కూర్చోవడానికీ ఇబ్బంది పడే పరిస్థితి వచ్చింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు హర్షవర్ధన్, అజయ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో అజయ్‌ని సిద్దిపేట ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించినట్లు సమాచారం. హర్షవర్ధన్ అనే విద్యార్థిది హైదరాబాద్ రామంతపూర్. తీవ్రగాయాలకు గురైన హర్షవర్ధన్ తట్టుకోలేక విషయాన్ని రామంతపూర్ ఉంటున్న తల్లిదండ్రు సాంబయ్య రజితలకు సమాచారం ఇవ్వడంతో వారు పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను పశువులను బాదినట్లు బాదారని, పిల్లలను కొట్టిన పీడీని, దుడ్డు కర్ర తెచ్చి ఇచ్చిన వాచ్‌మన్ భరత్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై వైస్‌ప్రిన్సిపాల్ కృష్ణ మాట్లాడుతూ సంఘటన విషయమై సంబంధిత ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు తెలిపాడు.



విద్యార్థి చేతికి గాయం



దెబ్బలు తిన్న విద్యార్థులు

వైద్యసేవలపై కేంద్ర వైద్యబృందం ఆరా

- ప్రభుత్వాసుపత్రుల్లో, ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న సేవల పరిశీలన

సిద్దిపేటటౌన్/ములుగు/వర్గల్/కుకునూరుపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో అసంక్రమిత వ్యాధులపై హైదరాబాద్‌లో జరుగుతున్న జాతీయ సెమినార్‌లో భాగంగా జిల్లాలో అసంక్రమిత వ్యాధులకు అందుతున్న వైద్యసేవలపై కేంద్రవైద్యబృందం సభ్యులు బుధవారం ఆరా తీశారు. ఈ సందర్భంగా వారంతా సిద్దిపేటలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఎన్‌సీడీ సెంటర్‌ను తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్, డయాలసిస్ సెంటర్, ములుగు, మర్కుక్, కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మామిడ్యాల, నెంటూర్, ఎర్రవల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, సిద్దిపేటలోని బస్తీ దవాఖాన, కాలకుంటకాలనీ, నాసర్‌పుర ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలను, వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకుని వారికి అందిస్తున్న వైద్య సేవల వివరాలను పరిశీలించారు. ఆయా ఆసుపత్రుల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వైద్యుల పనితీరును చూసి వారిని మెచ్చుకున్నారు. సిద్దిపేట గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో ఆరోగ్య శాఖ అధికారుల బృందంతో కలిసి పాల్గొన్న కలెక్టర్ మనుచౌదరి జిల్లాలో అసంక్రమిక వ్యాధుల వైద్య సేవలకు ప్రభుత్వం కల్పించిన వైద్య సౌకర్యాలు, వైద్య సేవల వివరాలను వివరించారు. ఇక జిల్లాలో సందర్శించిన వైద్యబృందంలో ఉత్తప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ పార్థసారథిసేన్‌శర్మ, తెలంగాణ కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆర్.వి కర్నన్, మేనేజింగ్ డైరెక్టర్ మినిస్టర్ ఆఫ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆరాధన పట్నాయక్, చత్తీస్‌ఘడ్ మేనేజింగ్ డైరెక్టర్ నేషనల్ హెల్త్ మిషన్ విజయ్ దయరామ్, రాజస్థాన్ మేనేజింగ్ డైరెక్టర్ నేషనల్ హెల్త్ మిషన్ డాక్టర్ భారతి దీక్షిత్, సీనియర్ ఈఏ మినిస్టర్ ఆఫ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఇంద్రాణి కౌశల్, నాగాలాండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌హెచ్‌ఎం డాక్టర్ అకౌసరహి వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీడీ కార్యక్రమ అధికారులు ఉన్నారు. ఆయా కార్యక్రమాల్లో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పల్వాన్‌కుమార్, ప్రభుత్వ వైద్య కళాశాల డైరెక్టర్ విమలాథామస్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండ్ డాక్టర్‌శాంతి, వైద్యురాలు అఖిల, ఎంపీహెచ్‌ఈవో ప్రేమ్‌చందర్, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ కీర్తి, జిల్లా ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి ఆనంద్, మండల వైద్యాధికారులు హరిత, మీణ, సిబ్బంది మహేశ్, మరియమ్మ, తదితరులు ఉన్నారు.



సిద్దిపేటలోని జీజీహెచ్‌లో వైద్య సేవలపై ఆరా తీస్తున్న కేంద్ర వైద్య బృందం సభ్యులు



కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందితో కేంద్ర వైద్య బృందం



దుబ్బాకలోని వేంకటేశ్వరాలయం

ముక్కోటికి ఆలయాలు ముస్తాబు

8



హుస్నాబాద్ బస్టాండ్

ఆధునికీకరణ..అదిరింది

- మంత్రి పొన్నం ప్రత్యేక చొరవ..
- రూ. 2 కోట్లతో పనులు
- త్వరలో ప్రారంభానికి సన్నాహాలు

8

నాగమణి ఇంటికి అధికారులు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

గజ్వేల్‌రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన "అయ్యో నాగమణి ఎంత పని అయిపోయే కట్టుకున్న భర్త నీ మరణం వార్త విని అదృశ్యమైతే" అనే వార్తకు జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజు స్పందించారు. బుధవారం ఆయన గజ్వేల్ మండలం బంగ్లవెంకటాపూర్ గ్రామానికి వెళ్లి నాగలక్ష్మి కుమారులు రాజేందర్, హరికృష్ణ, చందును కలిశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ వివరాలు వారి ఆర్థిక పరిస్థితిపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. దశదిన కర్మ తర్వాత వారి సీడబ్ల్యూసీ ఎదుట హాజరుపరిచి వారి ఆదేశాల మేరకు వసతి చదువు బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుందని తెలిపారు. మిషన్ వాత్సల్యం ద్వారా స్పాన్సర్‌షిప్ స్కీం ద్వారా నగదు వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు.



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పౌష్టికాహారంపై అవగాహన ఉండాలి

- ఎంఈవో మాధవరెడ్డి

జగదేవ్‌పూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పోషకాహారంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో మాధవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జగదేవ్‌పూర్ మండలంలో తిగుల్ ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తయారుచేసుకుని వచ్చిన వంటకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇలాటి ఫెస్టివల్స్‌తో విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన కలుగుతుందని తెలిపారు. సర్వపిండి, జొన్నరొట్టె, చిరుధాన్యాలతో తయారు చేసి తీసుకువచ్చిన విద్యార్థులను, తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సైదులు, కనకయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపికళ, ఉపాధ్యాయులు సత్తయ్య, అమృతమ్మ, భాస్కర్, నాగరాజు, బాల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, వివిద పార్టీల నాయకులు దయానంద్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిగుల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ఫుడ్ ఫెస్టివల్

స్వాతంత్ర్య సమరయోధురాలు మృతి


జంగిటి లచ్చవ్వ

ధూళిమిట్ట, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు, రజాకార్ల ఆగడాలకు ఎదురొడ్డి పోరాడిన ధీర వనిత జంగిటి లచ్చవ్వ(90) బుధవారం అనారోగ్య, వృద్ధాప్య కారణాలతో మృతి చెందింది. గ్రామస్థులు జంగిటి లచ్చవ్వ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా సుమలత


చెరుకు సుమలత

చేర్యాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన చెరుకు సుమలత నియామకమయ్యారు. ఈమేరకు బుధవారం మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదులో ప్రత్యేక కృషి చేసినందుకు చెరుకు సుమలతకు కమిటీలో ప్రాధాన్యం కల్పించారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

'యంగ్ లీడర్స్ డైలాగ్స్'కు గాజులపల్లి యువకుడి ఎంపిక


గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మతో ఎంపికైన యువత

దౌల్తాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నేషనల్ యంగ్ లీడర్స్ డైలాగ్స్‌కు సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామానికి చెందిన యువకుడు మహమ్మద్ షాదుల్లా ఎంపికయ్యారు. నేషనల్ యూత్ డేను పురస్కరించుకుని న్యూఢిల్లీలో ఈ నెల 10 నుంచి 12 వరకు నిర్వహించే యూత్ ఫెస్టివల్‌లో మహమ్మద్ షాదుల్లా పాల్గొని హం పడే దేశ పడే అనే కొత్త పథకంతో భావితరాల భవిష్యత్తు బడి ప్రదర్శించి తన ఆలోచనలను వ్యక్తపరచనున్నాడు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం తరఫున వీక్షిత్ భారత్ కోసం ఎంపికైన వారిని మంగళవారం గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు


ఖోఖో పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పుల్‌కల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో నేటి నుంచి నిర్వహించనున్న 57వ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు బుధవారం ఉమ్మడి మెదక్ జిల్లా క్రీడాకారులు బయలుదేరి వెళ్లారు. మండల కేంద్రమైన చౌటకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా ఖోఖో అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో 15 మంది క్రీడాకారులకు వారం రోజులుగా శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఖోఖో సీనియర్ క్రీడాకారుడు కలాలి నాగాగౌడ్ పర్యవేక్షణలో కొనసాగుతున్న ఈ ఉమ్మడి మెదక్ జిల్లా క్రీడాకారుల శిక్షణ శిబిరం బుధవారంతో ముగియగా వారు రాష్ట్రస్థాయి క్రీడలకు తరలివెళ్లారు. చౌటకూర్‌కు చెందిన క్రీడాకారులు 9 మంది కాగ, మిగిలిన క్రీడాకారులు ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మునిపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నుంచి గుజరాత్‌కు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. భారీ ఎత్తున రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా వద్ద మాటు వేసి లారీలో తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకున్నారు. సుమారు 250 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

క్రైం కార్నర్

ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చిన భార్య

● ఉత్తర్‌పల్లి హత్య కేసు ఛేదన
● వివరాలు వెల్లడించిన సంగారెడ్డి రూరల్ పోలీసులు


మాందాపూర్ రాజు (ఫైల్)

కంది, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గత నెల 30న సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఉత్తర్‌పల్లి గ్రామ శివారులో సంగారెడ్డి పట్టణానికి చెందిన మాందాపూర్ రాజుని ఎవరో గుర్తుతెలియని వ్యక్తుల గొంతు కోసి హత్య చేసిన విషయం తెలిసిందే. వివాహేతర సంబంధం పెట్టుకున్న భార్య ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించినట్లు పోలీసుల విచారణలో తేలింది. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి బుధవారం కేసు వివరాలను తెలిపారు. సంగారెడ్డి పట్టణంలోని ఎస్ఐజీ కాలనీలో నివాసం ఉంటున్న మాందాపూర్ రాజు(35) పదేళ్ల క్రితం వరంగల్ నుంచి సంగారెడ్డికి వలసవచ్చాడు. అతని భార్య సుమలత (32) తమ ఇద్దరు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నారు. భార్యభర్తలు ఇద్దరు కొండాపూర్ మండల పరిధిలోని ఓ ప్రైవేటు పరిశ్రమ క్యాంటీన్లో పని చేసేవారు. అదే క్యాంటీన్లో వంట మాస్టర్‌గా ఉన్న రామస్వామి(38)తో సుమలతకు పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. వీరిద్దరి వివాహేతర సంబంధం విషయం సుమలత భర్త రాజుకు తెలిసింది. దీంతో తమకు అడ్డుగా ఉన్నాడని భావించి రాజుని హత్య చేసేందుకు కుట్రపన్నారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం సుమలత, రామస్వామి రాజుకు మద్యం తాగుదామని ఆశ చూపించి డిసెంబరు 29న రాత్రి కంది మండలం ఉత్తర్‌పల్లి గ్రామ శివారులోని ఓ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లారు. అక్కడ రాజుకి ఫుల్లుగా మద్యం తాగించారు. అతడు మత్తులోకి జారుకున్నాకా తమ వెంట తెచ్చుకున్న కత్తితో గొంతు కోసి హత్య చేశారు. పోలీసులు నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా వారే ఈ హత్య చేసినట్లు అంగీకరించారు. నిందితుడైన రామస్వామి కంది మండలం కవలంపేట గ్రామానికి చెందినవాడు కాగా, అతడికి భార్య ఒక కూతురు ఉన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సంగారెడ్డి రూరల్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు

చెరువులో పడి వృద్ధురాలి ఆత్మహత్య

రామాయంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : చెరువులో పడి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం రామాయంపేట మండలం డి.ధర్మారంలో వెలుగుచూసింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నక్కని ఎల్లవ్వ(65) బుధవారం ఉదయం లేచేసరికి ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబీకులు ఇరుగుపొరుగు, బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. చివరకు చెరువు వద్ద ఆమె ఆనవాళ్లు కనిపించడంతో పోలీసులు గజ ఈతగాళ్లను దింపి మృతదేహాన్ని వెలికి తీయించారు. అనంతరం శవాన్ని రామాయంపేట మార్చురీకి తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

చనిపోతానంటూ ఫోన్.. కొడుకును వెతికే ప్రయత్నంలో రైలు ఢీకొని తండ్రి మృతి


రంగయ్యాగారి పెద్దనర్సింలు (ఫైల్)

రామాయంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఊర్లో జరిగిన ఓ గొడవతో మనస్తాపానికి గురై.. తాను చనిపోతున్నట్లు ఫోన్ రాగా.. కొడుకును వెతికే ప్రయత్నంలో తండ్రి రైలు ప్రమాదానికి గురై ప్రాణాలొదిలాడు. ఈ ఘటన రామాయంపేట మండల పరిధి అక్కన్నపేట శివారులో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం బాగిర్తిపల్లికి చెందిన రంగయ్యాగారి పెద్ద నర్సింలు(55) ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో రాత్రిపూట కొడుకు ఫోన్ కాల్ వచ్చింది. తాను సూసైడ్ చేసుకుంటున్నట్లు తెలపడంతో నర్సింలు భిక్కనూర్ పోలీసులకు సమాచారం అందజేసి కొడుకు మొబైల్ నంబర్ ఇచ్చాడు. వెంటనే పోలీసులు మొబైల్ ట్రాక్ చేసి రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ సమీపంలో అతడిని గుర్తించి కాపాడారు. ఈ విషయం తెలియని తండ్రితో పాటు కుటుంబీకులు లింగాపూర్, అక్కన్నపేట ప్రాంతాల్లో వెతికే క్రమంలో అర్ధరాత్రి వేళ హైదరాబాద్ వెళ్తున్న ఓ రైలుకు తగిలి అక్కడికక్కడే చనిపోయాడు. ఓ వైపు భార్య, మరో ఇద్దరు అక్కడే ఉన్నప్పటికీ వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

రామాయంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ పాదచారి దుర్మరణం పాలైన ఘటన బుధవారం రాత్రి రామాయంపేట మండలం అక్కన్నపేట శివారులో జరిగింది. కామారెడ్డి జిల్లా రథాల రామారెడ్డి గ్రామానికి చెందిన దండబోయిన నారాయణ(59) అక్కన్నపేటలోని ఓ ఫామ్‌హౌస్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి మరో వ్యక్తితో కలిసి రైల్వేస్టేషన్ వైపు నడుచుకుంటు వెళ్లాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనం నడుపుతూ బలంగా ఢీకొట్టి పారిపోయాడు. విషయం తెలుసుకున్న రామాయంపేట ఎస్ఐ బాల్‌రాజ్ ఘటనా స్థలికి చేరుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టెర్రర్ హైవేలు


765డి జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న మలుపు

యమడేంజర్‌గా 765డి జాతీయ రహదారి

గుమ్మడిదల నుంచి కొల్చారం వరకు అనేక మలుపులు

డివైడర్ లేక మరింత ప్రమాదకరం

హైదరాబాద్ - మెదక్ హైవేపై ప్రయాణించేందుకు బెంబేలు

నర్సాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మెదక్-హైదరాబాద్ 765డి జాతీయ రహదారిపై ప్రయాణించాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. ఈహైవేను విస్తరించినప్పటి నుంచి వాహన రాకపోకలు పెరగగా, అదేస్థాయిలో ప్రమాదాలు చోటుచేసుకుంటూ యమడేంజర్‌గా మారింది. ముఖ్యంగా కొల్చారం - గుమ్మడిదల మధ్య ఉన్న మూలమలపులు ప్రాణాంతకంగా మారాయి. ఎంతో మంది దుర్మరణం పాలవుతున్నా హైవే అథారిటీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

17 కిలోమీటర్లే ఫోర్ లేన్

మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ ఔటర్ రింగురోడ్డు నుంచి నర్సాపూర్, కౌడిపల్లి, కొల్చారం మీదుగా మెదక్ సమీపంలోని రాంపూర్ వరకు 62 కిలోమీటర్లు రోడ్డును ఆరేళ్ల క్రితం జాతీయయ రహదారిగా రూ.435 కోట్లతో విస్తరించారు. అయితే ఓఆర్ఆర్ నుంచి సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల వరకు కేవలం 17 కిల్పోమీటర్లు మాత్రమే నాల్గు లేన్లుగా, ఇరువైపుల 50 అడుగుల మేర విస్తరించారు. గుమ్మడిదల అటవీ ప్రాంతం నుంచి మెదక్ సమీపంలోని రాంపూర్ వరకు మిగతా 45 కిలోమీటర్ల రోడ్డును మాత్రం అటవీ ప్రాంతం ఉందన్న ఉద్దేశంతో కేవలం పది మీటర్లు మాత్రమే విస్తరించి మూడు లేన్ రోడ్డుగా మార్చారు. పైగా మలుపులు కూడా అలాగే వదిలేశారు. జాతీయ రహదారి కావడంతో రోడ్డు సాఫీగా ఉండటంతో వాహనదారులు వేగంగా వెళుతుండడంతో మలుపుల వద్ద అదుపుతప్పి ఎదురుగా వచ్చే వాటిని ఢీకొంటున్నారు. ఇలాంటి ప్రమాదాలే ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. పైగా ఈ జాతీయ రహదారిపై డివైడర్ కూడా కేవలం గండిమైసమ్మ నుంచి గుమ్మడిదల వరకు మాత్రమే ఉంది. ఆ తర్వాత గ్రామాలు ఉన్న చోట మాత్రమే డివైడర్‌ను నిర్మించి మిగతాదంతా వదిలేశారు. వాహనాలను ఓవర్‌టేక్ చేసే సమయంలో డివైడర్ లేక ఎదురుగా వచ్చే వాహనాలపైకి దూసుకెళ్లి ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రమాద మలుపులు ఇవే

గుమ్మడిదల అటవీ ప్రాంతంలోని నలవల్లి మేడాలమ్మ ప్రాంతం, వ్యవసాయ పరిశోధన కేంద్రం వై జంక్షన్, అర్బన్ పార్కు, సబ్‌స్టేషన్, సీతారాంపూర్, చిన్నచింతకుంట, పెద్దచింతకుంట, రెడ్డిపల్లి, కౌడిపల్లి మండలంలో లోతువాగు, దేవులాతండా, వెంకట్రావ్‌పేట, రాయిలాపూర్, నాగ్సన్‌పల్లి, అంతారం, మహ్మద్‌నగర్, కౌడిపల్లి, కొల్చారం మండలంలో హనుమాన్‌బండల్, కిష్టాపూర్ తదితర గ్రామాల వద్ద మలుపులు ఉండటంతో ప్రమాదాలు తరుచు జరుగుతున్నాయి. ఓవైపు రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్న ప్రస్తుత తరుణంలో మెదక్ - హైదరాబాద్ హైవేపై ప్రమాదాల నివారణకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఏడాదిలో వందమంది మృత్యువాత

జాతీయ రహదారిపై గతేడాది చోటుచేసుకున్న ప్రమాదాల్లో వందమంది వరకు ప్రాణాలు కోల్పోవడమే కాకుండా మరెందరో క్షతగాత్రులయ్యారు. జాతీయ రహదారిపై గుమ్మడిదల మండల అటవీ ప్రాంతంలో 25 ప్రమాదాలు జరగగ్గా 9 మంది చనిపోయారు. మూడురోజుల క్రితమే నల్లవల్లి సమీపంలోని మేడాలమ్మ మలుపువద్ద జరిగిన ప్రమాదంలో నలుగురు మృతిచెందగా, వారి కుటుంబాలనే కాకుండా.. ఈ రోడ్డుగుండా ప్రయాణించే వారందరినీ కలిచివేసింది. ఇక నర్సాపూర్ పరిధిలో వ్యవసాయ పరిశోధన కేంద్రం నుంచి రెడ్డిపల్లి వరకు ఆరుగురు చనిపోయారు. కాగా కౌడిపల్లి, కొల్చారం మండలాల పరిధిలో అత్యధికంగా మరణాలు సంభవించాయి. కౌడిపల్లి మండలంలో 26 మంది చనిపోగా కొల్చారం మండలంలో 17 మంది వరకు మృతి చెందారు.


కౌడపల్లి మండల పరిధిలో జరిగి ప్రమాదం(ఫైల్)

ప్రమాదాల రోడ్డుకు టోల్‌చార్జీ

ఔటర్ రింగ్ రోడ్డు నుంచి 765డి హైవే ప్రారంభమవుతున్నది. అక్కడి నుంచి సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల వరకు 17 కిలోమీటర్ల మేర మాత్రమే నాలుగు లేన్‌లుగా ఉంటుంది. కానీ ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే మాత్రం టోల్ కట్టి తీరాల్సిందే. మెదక్ వైపు నుంచి వచ్చే వారికి గుమ్మడిదల సమీపంలో ఏర్పాటు చేసిన టోల్‌గేటు వద్ద చార్జీ వసూలు చేయడం పట్ల సర్వత్రా అభ్యంతరాలు వస్తున్నాయి. నాలుగు లేన్‌లు రోడ్డు ఉండే ప్రాంతాలైన ఓఆర్ఆర్ నుంచి గుమ్మడిదల వరకు మాత్రం టోల్‌చార్జీ లేదు. ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న మెదక్, నర్సాపూర్ వారికి మాత్రం ముక్కుపిండి టోల్‌చార్జీలను వసూలు చేస్తున్నారని మండిపడుతున్నారు. నర్సాపూర్ ప్రాంతవాసులకు 20 కిలోమీటర్లలోపే ఉన్నా టోల్ వసూలు చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

పార్కింగ్ ప్రాణసంకటం


హైవే 65పై తరచూ ప్రమాదాలు జరుగుతున్న చౌరస్తా

జహీరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : 65వ నంబర్ జాతీయరహదారి ప్రమాదభరితంగా మారుతోంది. జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండలం కొత్తూర్(డి) మొదలుకుని మొగుడంపల్లి మండలం మాడ్గి చౌరస్తా వరకు సుమారు 45 కిలోమీటర్ల మేర జహీరాబాద్ మీదుగా 65వ నంబరు జాతీయరహదారి విస్తరించి ఉంది. నాలుగు లేన్‌ల రోడ్డు ఉన్నప్పటికీ అతివేగంగా వచ్చే వాహనదారులకు చౌరస్తాలు, డైవర్షన్ పాయింట్‌లు, రోడ్డు పక్కన పార్కింగ్ ప్రాణసంకటంగా మారుతున్నది.

రోడ్ల పక్కనే అడ్డదిడ్డంగా పార్కింగ్

జహీరాబాద్ మీదుగా ముంబై తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. దీంతో కొందరు ప్రధాన చౌరాస్తాలను వ్యాపార కేంద్రాలుగా మార్చుకున్నారు. హైవే పొడవునా రోడ్డును అనుకుని అనేక మంది వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడికి వచ్చే వారు రోడ్డు పక్కనే ఇష్టారీతిగా వాహనాలను పార్కింగ్ చేస్తుండడం ప్రమాదాలకు కారణమవుతోంది.

బ్లాక్‌స్పాట్లు ఇవే..

కొత్తూర్(డి), చింతలగట్టుచౌరస్తా, దిగ్వాల్, రాయిపల్లి(డి), హుగ్గెల్లి చౌరస్తా, జహీరాబాద్ పట్టణంలోని ఇంద్రప్రస్థాన్, అల్గోల్ చౌరస్తా, బూడ్దిపాడ్, సత్వార్, అసద్‌గంజ్ చౌరస్తాలను అధికారులు బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు. ఈ చౌరస్తాల వద్ద వాహన దారులకు వేగనియంత్రణను కట్టడి చేస్తే కొంత మేరకు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. రాత్రివేళల్లోనైతే ఆయా చౌరస్తాల వద్ద లైట్లు ఉండవు. సంకేత సూచికలు సరిగ్గా లేవు. రేడియం స్టిక్కర్లు పనిచేయడం లేదు. కొన్ని ప్రాంతాల్లో జీబ్రాలైన్స్ ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో అసలే లేవు.

మూడేళ్లల్లో 180 మంది దుర్మరణం

జహీరాబాద్ డివిజన్‌లో మూడేళ్లల్లో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో 180 మంది మృతిచెందగా 149 మంది గాయాలపాలయ్యారు. 2022లో జరిగిన రోడ్డుప్రమాదాల్లో 65 మంది మృతిచెందగా, 75 మందికి గాయాలయ్యాయి. 2023లో 63 మంది మృతిచెందగా, 35 మంది గాయాలపాలయ్యారు. 2024లో 52 మంది మృతిచెందగా, 39 మంది క్షతగాత్రులయ్యారు.


జహీరాబాద్ బైపాస్ రోడ్డు పక్కన నిలిపిన లారీలు

ఎనిమిదో రోజు అదే ఇగం!

● కోహీర్‌లో 8.8 డిగ్రీల ఉష్ణోగ్రత
● వణుకుతున్న ఉమ్మడి జిల్లా

కోహీర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో వరుసగా ఎనిమిదో రోజు చలి తీవ్రత కొనసాగుతూనే ఉంది. ఈ సీజన్ లోనే రికార్డుస్థాయిలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా బుధవారం కూడా సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. కోహీర్‌లో 8.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తం చలి తవ్రత తగ్గడం లేదు.

సంగారెడ్డి జిల్లాలో.. న్యాల్‌కల్‌లో 10.7, మలచెల్మలో 10.8, అల్గోల్‌లో 11.0, సత్వార్‌లో 11.1 మొగుడంపల్లిలో 11.3, ఝరాసంఘంలో 11.5, నల్లవల్లిలో 11.5, జహీరాబాద్‌లో 11.8, దిగ్వాల్ 11.9, ఆర్‌సిపురంలో 12.1, కంకోల్‌లో 12.2, లక్ష్మీసాగర్‌లో 12.3, ఆల్మాయిపేట్‌లో 12.4, కందిలో 12.6, పుల్కల్‌లో 12.8, కడ్పల్‌లో 12.8, సింగూర్‌లో 12.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

మెదక్ జిల్లాలో.. మనోహరాబాద్‌లో 12.4, శివ్వంపేటలో 12.7, బోడగట్(ఈఎస్ఎస్)లో 12.9, చిప్పల్‌తుర్తి 12.9, శంకరంపేట్(ఎ)లో 12.9, డిగ్రీలు.

సిద్దిపేట జిల్లాలో.. అంగడికిష్టాపూర్‌లో 12.2, మిరిదొడ్డిలో 12.7, ములుగులో 12.8, కొండపాకలో 12.9, చిట్యాలలో 12.9 డిగ్రీలుగా నమోదైంది.



ఆలయ భూముల్లో త్వరలో సోలార్ యూనిట్

● వంద ఎకరాలను లీజుకు తీసుకున్నాం
● డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు

నర్సాపూర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లోని లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి చెందిన వంద ఎకరాల్లో త్వరలో సోలార్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు తెలిపారు. బుధవారం నర్సాపూర్ - మెదక్ ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఆలయ భూమిని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన రోడ్డుకు అతి సమీపంలో నిరుపయోగంగా ఉన్న ఆలయ భూమని వినియోగంలోకి తేవాలనే ఉద్దేశంతో లీజుకు తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహిస్తున్న సందర్భంగా మెదక్ జిల్లాలోనూ ఏర్పాటు చేసేందుకు ఆలయానికి చెందిన వంద ఎకరాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఇక్కడ 25 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట విద్యుత్‌శాఖ ఎస్ఈ శంకర్, డీఈఈ చాంద్‌బాషా, ఏడీఈ రమణారెడ్డి, తహసీల్దార్ కె.శ్రీనివాస్, ఆలయ ఈవో శ్రీనివాస్, ఆర్ఐ సిద్ధిరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రైవేటు స్కూళ్ల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళతా

● విద్యాసంస్థలను సేవా దృక్పథంతో కొనసాగించాలి
● రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

పటాన్‌చెరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని, సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. బుధవారం పటాన్‌చెరు శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి మంత్రి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 60శాతం పాఠశాల విద్యను అందిస్తున్న ప్రైవేటు స్కూళ్లపై గురుతరమైన బాధ్యత ఉందన్నారు. విద్యను వ్యాపారాత్మకంగా కాకుండా సేవా దృక్పథంతో కొనసాగించాలన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తేనే విద్యార్థులు ఉత్తమ పౌరులుగా మారుతారని అన్నారు. తల్లిదండ్రుల ఆశయాలు, తద్వారా సమాజ శ్రేయస్సును కాపాడటంలో ప్రైవేటు యాజమాన్యాల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సమస్యల పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ముఖ్య సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం లభించేలా చిత్తశుద్ధితో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధిని అందించడంలో సైతం ప్రైవేటు విద్యాలయాలు ఎంతో కీలకంగా పనిచేస్తున్నాయని, టీచర్లు, ఇతర సిబ్బంది, ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు వారి సమస్యలను సైతం పరిష్కరించేందుకు సహకరిస్తామన్నారు. సమావేశంలో టీఆర్ఎస్ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్, కార్యదర్శి రమేష్‌రావు, కోశాధికారి రాఘవేంధర్‌రెడ్డి, నాయకులు విలియంజేమ్స్, ప్రభాకర్‌రెడ్డి, సాయితేజ, ఉమామహేశ్వరావు, మహ్మద్ ఇస్తియాబ్‌గుల్షన్, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేంధర్‌రెడ్డి, కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి సెంట్రల్ జైలును సందర్శించిన న్యాయాధికారి

సంగారెడ్డి క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి సెంట్రల్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ బుధవారం సందర్శించారు. జైలులోని బ్యారక్‌లు, గదులు, వంట గది, బాత్‌రూమ్ పరిశీలించారు. జైలు ఆవరణ అంతా తిరిగి ఖైదీలతో మాట్లాడారు. జైలులో సదుపాయాలు, భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు కావాల్సిన అవసరాలు, సదుపాయాల అందేలా చూడాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. న్యాయ సేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని తాము నియమిస్తామని ఖైదీలకు న్యాయాధికారి తెలియజేశారు.


ఖైదీలుకు అందజేస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న న్యాయాధికారి రమేష్

ముత్తంగిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

● రెస్టారెంట్, టిఫిన్ సెంటర్‌కు నోటీసుల జారీ


రెస్టారెంట్‌లో నిల్వ ఉంచిన వంటకాలను పారబోయిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

సంగారెడ్డి అర్బన్/పటాన్‌చెరు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండల పరిధి ముత్తంగిలోని పలు రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు బుధవారం దాడులు చేశారు. స్వీట్‌హార్ట్ రెస్టారెంట్‌తో పాటు హరిదోశ టిఫిన్ సెంటర్లలో విస్తృత తనిఖీలు నిర్వహించగా విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూశాయి. ముందుగా స్వీట్‌హార్ట్ రెస్టారెంట్‌లో నిల్వ ఉంచిన ఫ్రై చికెన్, ఇతరత్రా ఆహార పదార్థాలను పారవేయించారు. నాణ్యత, పరిశుభ్రత మెరుగుపర్చుకోవాలని నోటీసులు జారీ చేశారు. పప్పు, టామోటా సాస్‌ల శాంపిళ్లను సేకరించారు. ఆ తర్వాత హరి దోశ టిఫిన్ సెంటర్‌ను తనిఖీ చేశారు. రూ.3 వేల విలువైన కలర్ టీ పౌడర్‌ను పారబోశారు. అల్లం వెల్లుల్లి శాంపిళ్లను సేకరించి నాణ్యత, పరిశుభ్రత మెరుగుపర్చుకోవాలని నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ మాట్లాడుతూ ఆహారాన్ని రిఫ్రిజరేటర్‌లో నిల్వ ఉంచకూడదని, ఆహార భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సేకరించిన శాంపిళ్లను ల్యాబ్‌కు పంపిస్తామని వచ్చిన ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలుంటాయని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు శ్రీషికా, రాజేశ్వర్, ఫుడ్ టెక్నాలజిస్ట్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఈ అంటూ లైన్‌మన్‌కు బెదిరింపులు

● మీటర్ ఇప్పిస్తానని వినియోగదారుల నుంచి డబ్బు వసూలుకు ప్రయత్నం
● సామ్యాతండాకు చెందిన కాట్రోత్ సురేష్‌గా గుర్తింపు.. కేసు నమోదు


కాట్రోత్ సురేష్

శివ్వంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ ఏఈ అని చెప్పి లైన్‌మన్‌ను బెదిరించడమే కాకుండా, తక్కువకే మీటర్లు ఇప్పిస్తానని నమ్మబలికి వసూళ్లకు పాల్పడిన దుండగుని విద్యుత్ శాఖ సిబ్బంది పోలీసులకు అప్పగించిన సంఘటన లింగోజిగూడలో బుధవారం చోటుచేసుకున్నది. లైన్‌మన్ సురేష్, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పిల్లుట్ల, కొత్తపేట, రత్నాపూర్ లింగోజిగూడ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న గోదూరి సురేష్‌కు ఈనెల 5న గుర్తుతెలియని వ్యక్తి 500 కేవీ ఏఈని మాట్లాడుతున్నానని, ప్రజలు విత్‌ఔట్ మీటర్‌తో డొమెస్టిక్ విద్యుత్ వాడుతుంటే ఏం చేస్తున్నావంటూ బెదిరించగా ఫేక్‌కాల్ అని భావించి పట్టించుకోలేదు. కాగా, బుధవారం లింగోజిగూడలో పారిశుధ్య కార్మికుడైన దాసరి భిక్షపతి దగ్గరికి వచ్చి మీటర్ లేని వారికి రూ.250కే మీటర్ ఇస్తున్నామని డబ్బు కట్టమని చెప్పడంతో భిక్షపతి లైన్‌మన్‌కు సమాచారం అందించారు. లైన్‌మన్ సురేష్ వెంటనే అక్కడికి వెళ్లగా ఫోన్ చేసి బెదిరించిన వ్యక్తి, ఇతడు ఒకరే అని తెలిసింది. మండల పరిధిలోని టిక్యా దేవమ్మగూడెం పంచాయతీ పరిధిలో సామ్యాతండాకు చెందిన కాట్రోత్ సురేష్‌గా గుర్తించారు. లైన్‌మన్ ఫిర్యాదు మేరకు కాట్రోత్ సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు. కాట్రోత్ సురేష్ గతంలోనూ పలు గ్రామాల్లో వసూళ్లకు, అక్రమాలకు పాల్పడ్డట్లు తెలిసింది.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్

జహీరాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో ఖిజార్‌యా అంతర్‌రాష్ట్ర గోల్డ్‌కప్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా కొనసాగుతుంది. ఐదు రోజులుగా నిర్వహించిన మ్యాచ్‌ల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 12 జట్లు పాల్గొన్నాయి. గ్రూపు దశలో నేషనల్‌ఖలీం ఎలెవన్, మాక్‌బ ళ్లారీ, డాలీసీసీ అచ్చంపేట, రాయల్‌కార్డ్, సేవాలాల్ జట్లు విజయం సాధించాయి.

గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తి అరెస్ట్

మద్దూరు, జనవరి 8 : మండలంలోని నర్సాయపల్లిలో గంజాయి మొక్కలు పెంచడంతోపాటు పొడిగా చేసి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్ అలీ వివరాలను వెల్లడించారు. నర్సాయపల్లికి చెందిన మహ్మద్ షబ్బీర్ కొద్ది రోజులుగా తన ఇంటి పెరట్లో గంజాయి మొక్కలు పెంచుతూ ఎండబెట్టి పొడిగా మార్చి బీహార్ కూలీలకు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలిసి దాడులు నిర్వహించి 38 గ్రాముల ఎండు గంజాయి, పెరట్లోని రెండు గంజాయి మొక్కలను, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ విజయ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ జనార్దన్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, నాగరాజు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రాయపోల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. రామారం గ్రామానికి చెందిన ఎలగందుల సతీష్ తన ఇంట్లో రేషన్ బియ్యాన్ని పెద్ద ఎత్తున నిల్వ ఉంచాడు. పక్కా సమాచారంతో బుధవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు సోదాలు చేయగా 19 బ్యాగుల్లో సుమారు 13 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని దౌల్తాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. ఈ మేరకు ఆర్ఐ భానుప్రకాష్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొండపాక, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తిమ్మారెడ్డిపల్లి, కుకునూరుపల్లి, లకుడారం, మాత్‌పల్లి గ్రామాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు రాయపోల్ విద్యార్థిని



కీర్తన

రాయపోల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ ఉన్నత పాఠశాలకు చెందిన టీ.కీర్తన రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో పోటీలకు ఎంపికైంది. డిసెంబరు 28 మెదక్ జిల్లా నర్సాపూర్‌లో జరిగిన ఓపెన్ సెలక్షన్స్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని పీడీ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 9 నుంచి 11 వరకు వరంగల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా తరపున ఆమె పాల్గొననున్నది. కీర్తనను హెచ్ఎం నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

వరల్డ్ వైడ్ కాంపిటీషన్‌లో సిద్దిపేట విద్యార్థి సత్తా



లలిత్‌కుమార్

సిద్దిపేట కల్చరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన అలామా వరల్డ్ వైడ్ కాంపిటీషన్స్-2025లో సిద్దిపేట పట్టణంలోని మెరిడీయన్ (బ్రాంచ్ 2)స్కూల్‌లో ఐదో తరగతి విద్యార్థి లలిత్‌కుమార్ సత్తా చాటాడు. అబాకస్, మెంటల్ అర్థమెటిక్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచాడు. లలిత్‌కుమార్‌ను పాఠశాల యాజమాన్యం, సిబ్బంది అభినందించారు.

డంపింగ్ యార్డును పరిశీలించిన కమిషనర్

గజ్వేల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డును మునిసిపల్ కమిషనర్ నరసయ్య బుధవారం పరిశీలించారు. చెత్త సేకరణలో భాగంగా డంపింగ్ యార్డులో జరుగుతున్న వేరు చేయు విధానాన్ని, విండ్రో కంపోస్ట్, డ్రై రిసోర్స్ సెంటర్‌ను పరిశీలించారు. విండ్రో కంపోస్టు తయారీలో ఎలాంటి ప్లాస్టిక్ వ్యర్థాలను రాకుండా చూడాలని ఆదేశించారు.

108 అంబులెన్స్ తనిఖీ

దౌల్తాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండల 108 అంబులెన్స్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ హరి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లో గల అత్యవసర మందులు, పరికరాలను, ఆక్సిజన్, పలు రికార్డులను పరిశీలించారు. 108 సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ భాను, పైలట్ నర్సింహులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చేర్యాల, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : డీటీఎఫ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు దేవులపల్లి కిష్టయ్య, రాజిరెడ్డి పాల్గొన్నారు

ఆధునికీకరణ.. అదిరింది

హుస్నాబాద్ ప్రయాణ ప్రాంగణానికి కొత్తరూపు

- మంత్రి పొన్నం ప్రత్యేక చొరవ..
- రూ.2 కోట్లతో పనులు
- త్వరలో ప్రారంభానికి సన్నాహాలు



సీసీతో నిర్మాణం చేసిన ఆవరణ

హుస్నాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం అత్యంత సుందరంగా మారింది. ఆధునికీకరణతో రూపురేఖలే మారిపోయాయి. చుట్టుపక్కల గ్రీనరీతో బస్టాండ్ కొత్త అనుభూతిని కలిగిస్తుంది. ఈ ప్రాంగణం అభివృద్ధికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. పనులు పూర్తి కావడంతో త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆయన రూ. 2 కోట్లు మంజూరు చేసి గతేడాది మార్చి 8న శంకుస్థాపన చేయగా, అదే నెల 21న పనులు షురూ చేశారు.

నాలుగు దశాబ్దాల తర్వాత..

హుస్నాబాద్ బస్టాండ్‌ను 1984 జూన్ 17న అప్పటి ఎమ్మెల్యే స్వర్గీయ బొప్పరాజు లక్ష్మీకాంతారావు కృషితో నాటి రాష్ట్ర రావాణా శాఖ మంత్రి సంగంరెడ్డి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. అప్పుడు మూడు వరకు ప్లాట్ ఫామ్‌లుండేవి. అనంతరం పలుమార్లు మరమ్మతులు చేశారు. మళ్లీ 14 ఆగస్టు 2017న రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. దీనికి రూ.33.59 లక్షలు మంజూరు చేశారు. నాడు అందులో ఉన్న హోటల్ గదులను తొలగించి విస్తరించారు. ప్రస్తుతం బస్టాండ్‌లో 8 ప్లాట్‌ఫామ్‌లుండగా అదనంగా మరో మూడు నిర్మించారు. 40 ఏళ్ల తరువాత పూర్తిస్థాయిలో ఆధునికీకరిస్తున్నారు.



హుస్నాబాద్ బస్టాండ్ ముఖ ద్వారం

ప్రారంభానికి సిద్ధం..

ఆధునికీకరించిన హుస్నాబాద్ బస్టాండ్‌ను త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తూర్పు వైపు ఒక ప్లాట్ ఫాం, పడమర వైపు రెండు ప్లాట్ ఫామ్‌లు నిర్మించారు. అదనంగా నిర్మిస్తున్న రెండు ప్లాట్ ఫామ్‌ల (పడమర) వైపు టాయ్‌లెట్స్‌ను ఏర్పాటు చేశారు.. బస్టాండ్ ముందు ఎలివేషన్ గ్రానైట్, రెయిలింగ్ వంటి పనులు చేశారు. బస్టాండ్ ప్రాంగణం కంపౌండ్ వాల్ పక్కన పచ్చటి మొక్కలు, ఆకట్టుకునే విధంగా గ్రీనరీని ఏర్పాటు చేశారు. దీని ఆవరణ మొత్తం సీసీ నిర్మాణం చేశారు. ప్లాట్ ఫామ్‌ల ఆధునికీకరించారు. లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. రాత్రి పూట బస్టాండ్ విద్యుత్ దీపాల మధ్య జిగేల్‌మంటుంది..





విద్యుత్ దీపాలు, సకల సౌకర్యాలతో హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్

డిజిటల్ అరెస్టు విధానమే లేదు

- సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : పోలీసులు



దుబ్బాకలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గంగరాజు

మర్కుక్/కోహెడ/రాయపోల్/దుబ్బాక, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సైబర్ జాగృత్ దివాస్ సందర్భంగా జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్ అనే విధానం లేదని, ఎవరైనా కాల్ చేసి ఈ విధమైన బెదిరింపులకు పాల్పడితే భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎస్ఐ దామోదర్ ఆధ్వర్యంలో పాములపర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కోహెడ కొత్త బస్టాండ్‌లో ప్రజలకు ఎస్ఐ అభిలాష్ సైబర్ నేరాలపై జాగ్రత్తలు వివరించారు. రాయపోల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్ఐ రఘుపతి డిజిటల్ మోసాలపై అవగాహన కల్పించారు. దుబ్బాకలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో మహిళ చట్టాలపై, సైబర్ నేరాలపై దుబ్బాక ఎస్ఐ గంగరాజు అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో పోలీస్ సిబ్బంది, పాఠశాల హెచ్ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.



విద్యుద్దీపాల కాంతుల్లో సిద్దిపేట పట్టణంలోని వేంకటేశ్వరాలయం

ముక్కోటికి ఆలయాలు ముస్తాబు

సిద్దిపేట కల్చరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ముక్కోటి ఏకాదశికి పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. పట్టణంలో మోహినిపురలోని శ్రీ పద్మావతి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయం, లాల్ కమాన్ వద్ద నున్న శ్రీ వెంకటేశ్వరాలయం (పాతది) వైకుంఠ ఏకాదశికి సిద్ధమయ్యాయి. అధికారులు, ఆలయ నిర్వాహకులతో ఆర్డీవో సదానందం సమావేశమై పలు సూచనలు చేశారు. మోహినిపుర వెంకటేశ్వరాలయంలో ఉత్తరద్వారా దర్శనానికి 5 క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయం నుంచి గాంధీ చౌక్ రోడ్డువైపు ధర్మ దర్శనం, 100 రూపాయల టికెట్ దర్శనం, వీవీఐపీ దర్శనం కోసం క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. సిద్దిపేట డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు క్యూలైన్లు కంట్రోల్ చేయడానికి వలంటీర్లుగా పనిచేయనున్నారు. భక్తులు నిర్వాహకులకు సహకరించాలని ఆలయ వ్యవస్థాపక చైర్మన్ రమేష్ విష్ణు, కార్యనిర్వాహణ అధికారి పారునంది విశ్వనాథ శర్మ, కమిటీ సభ్యులు కోరారు.

● దుబ్బాక, జనవరి8 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఉత్తర ద్వారా దర్శనం కోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దుబ్బాకలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరాలయం అందంగా తీర్చిదిద్దారు. ఇక్కడ శుక్ర, శని, ఆదివారం ఉత్తర ద్వార దర్శనం కల్పించడంతోపాటు గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వడ్లకొండ శ్రీధర్ తెలిపారు.

పలుచోట్ల ఉచిత వైద్య శిబిరాలు

కుకునూరుపల్లి/మద్దూరు/వర్గల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బొబ్బాయిపల్లి గ్రామంలో ఆర్‌వీఎం ఆస్పత్రి వారు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. వైద్యులు మౌనిక, రాజు, శృతి, కనకయ్య, మార్కెటింగ్ సిబ్బంది లక్ష్మణ్, సంతోష్ పాల్గొన్నారు.

మద్దూరు మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆర్‌బీఎస్‌కే వైద్యులు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సలీం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి. శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వర్గల్ మహాత్మా జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం గజ్వేల్ కంటి ఆస్పత్రి లోక్ నేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు సత్యనారయణ, పరుశరాం, సంజీవ్, కళాశాల ప్రధాన అధ్యాపకులు గడ్డం భాస్కర్ రావు, హెల్త్ సూపర్‌వైజర్ ఉమారాణి, అసిస్టెంట్ సూపర్‌వైజర్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



వర్గల్ మహాత్మా జ్యోతిబాపూలే డిగ్రీ కళాశాల విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు



విద్యార్థుల ఫొటోలతో..

చేర్యాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి ఎంపీపీఎస్‌కు చెందిన ఉపాధ్యాయుడు బోకూరి బాల్‌రెడ్డి వినూత్న ఆలోచన ఆదర్శంగా నిలిచారు. రోజువారీ తేదీ వివరాలు, నెలల పేర్లపై అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలపై ఆసక్తి కనబరిచేలా విద్యార్థుల వ్యక్తిగత ఫోటోను ముద్రించిన క్యాలెండర్లను రూపొందింపజేశారు. బుధవారం పాఠశాల హెచ్ఎం టి.కిషన్ చేతులమీదుగా విద్యార్థులందరికీ క్యాలెండర్లతో పాటు స్టేషనరీని విరాళంగా అందించారు.

మర్కుక్ ఎంపీడీవో బదిలీ

మర్కుక్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండల ఎంపీడీవోగా పనిచేస్తున్న అబ్జలుద్దీన్ వనపర్తి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తాత్కాలికంగా మండల సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అశోక్‌కుమార్‌ను నియమిస్తూ డీపీవో దేవకీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఎంపీడీవో అబ్జలుద్దీన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఎంపీడీవో ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శులు విద్యావికాస్‌రెడ్డి, సిద్దేశ్వర్, శాంతి, రాజశేఖర్ రెడ్డి, నీలిమ, మౌన తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మాక్ పోలింగ్

చేర్యాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలు, పోలింగ్ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ కొమురవెల్లి మండలం ఐనాపూర్ జడ్పీఎస్ఎస్‌లో బుధవారం గ్రామపంచాయతీ మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల దాఖలు, నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు, ప్రచారం, పోలింగ్ విధులు, బ్యాలెట్ పేపర్‌ల నమూనా, ఎన్నికల విధులు, పోలింగ్, ఓట్లలెక్కింపు ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమానికి డీఈవో ఇ. శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కొమురవెల్లి ఎంఈవో రమేశ్, ఉపాధ్యాయులు, ఏజీపీసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దాతల సహకారం మరువలేనిది

విద్యార్థులకు దుప్పట్లు, నోట్ పుస్తకాలు పంపిణీ

జగదేవ్‌పూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దాతల సహకారం మరువలేనిదని ఎంఈవో మాధవరెడ్డి అన్నారు. బుధవారం జగదేవ్‌పూర్ మండలంలో తిగుల్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మారేడుపల్లి(సికింద్రాబాద్) లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు, నోట్‌పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సైదులు, కనకయ్య, గోపికళ, వీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, ఉపాధ్యక్షులు సత్తయ్య, అమ్మతమ్మ, నవిత, నాగరాజు, భాస్కర్, సంతోషిమాత, నాయకులు దయానందరెడ్డి, ఆదర్శ కమిటీ కన్వీనర్ సుజాత పాల్గొన్నారు.

● చిన్నకోడూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు ప్రాథమిక పాఠశాలలో 248 మంది విద్యార్థులకు జ్యోతి స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో సమితి చైర్మన్ మంద పాండు టైలు, బెల్ట్‌లు, ఐడీ కార్డులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో యాదవరెడ్డి, ఎస్ఐ బాలకృష్ణ, కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు చిరంజీవి యాదవ్, ప్రధాన కార్యదర్శి కరుణాకర్, సేవా సమితి ట్రెజరర్ వనజ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

●ధూళిమిట్ట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అంగన్‌వాడీ చిన్నారులకు బుధవారం రిలయన్స్ ఫౌండేషన్ సభ్యులు బ్యాగులు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సాయి, ఆర్‌పీ ఉమా, అంగన్‌వాడీ టీచర్లు దుర్గభవాని, రజిత, లక్ష్మి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గజ్వేల్ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన గజ్వేల్ మండల పరిధిలోని జాలిగామలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పర్కి సుమన్(35)కు భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. డబ్బుల విషయంలో కుటుంబంలో మనస్పర్థలు రావడంతో సుమన్ ఈ నెల 5న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి యశోదా ఆస్పత్రికి తీసుకెళ్లగా మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. సుమన్ మృతిపై గ్రామంలో, వాట్సాప్ గ్రూపులలో భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. కేసు దర్యాప్తులో ఉంది.

'స్వయం ప్రతిపత్తి'తో విద్యార్థులకు మేలు

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజూమ్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

గజ్వేల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా వచ్చిందని, దీంతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరనుందని ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజూమ్ అన్నారు. కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అటానమస్ హోదా కల్పిస్తూ న్యూఢిల్లీలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ఉత్తర్వులను వెలువరించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ హోదా ఐదేళ్లపాటు కొనసాగుతుందని, ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నిధుల అవకతవకలపై విచారణ



విచారణ చేస్తున్న డీఎల్‌పీవో మల్లికార్జున్‌రెడ్డి

చేర్యాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామ పంచాయతీ నిధుల అవకతవకల ఆరోపణలపై డీఎల్ పీవో మల్లికార్జున్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి శాస్త్రి బాలరాజు జీపీ నిధుల గోల్‌మాల్‌కు పాల్పడ్డాడని సీపీఎం నాయకులు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్‌పీవో జీపీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శితో పాటు ఫిర్యాదుదారులను విచారించి వాంగ్మూలాలు నమోదు చేసుకున్నారు. విచారణ అనంతరం తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు ఆయన తెలిపారు. డీఎల్‌పీవో వెంట ఎంపీడీవో వర్మ ఉన్నారు.

ఉత్తమ ఫలితాల కోసం కృషి చేయాలి

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి



విద్యార్థినికి అల్పాహారం పంపిణీ చేస్తున్న డీఐఈవో రవీందర్ రెడ్డి

చిన్నకోడూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి సూచించారు. చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు సొంత ఖర్చుతో విద్యార్థులకు నిర్వహిస్తున్న అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌ను, అధ్యాపకులను ఆయన అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు, నిర్వాహకులు

సిద్దిపేట కల్చరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా రెడ్డి జేఏసీ సౌజన్యంతో మహిళా విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

● కోహెడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో బుధవారం మహిళలు, యువతులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాము నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు



స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

నంగునూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా నంగునూరు మండలం పాలమాకుల వేంకటేశ్వరాలయంలో బుధవారం గోదా రంగనాథ స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. సిద్దిపేట వికాస తరంగిణి సభ్యులు, గ్రామస్థులు పల్లకి సేవ, స్వామివారి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైదికులు రణధీరాచార్యులు మాట్లాడుతూ వెంకటేశ్వర ఆలయంలో ధనుర్మాసం పురస్కరించుకొని నెల రోజులపాటు తిరుప్పావై అనుసంధానం, స్వామివారి అర్చన, అభిషేకాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చేర్యాల దుర్గయ్య, సత్యనారాయణ, అశోక్, మల్లేశం, రామానుజం, బుచ్చిరెడ్డి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

'శంభు' బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కొండపాక, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం దుద్దెడ చారిత్రక మహిమాన్విత శైవ క్షేత్రం శ్రీ స్వయంభూ శంభు దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని, పోస్టర్‌ను బుధవారం స్థానిక ఆలయ ప్రాంగణంలో విడుదల చేశారు. శ్రీ స్వయంభు శంభు లింగేశ్వర సేవా సమితి ట్రస్టు చైర్మన్ మంచాల శ్రీనివాస్ ట్రస్ట్ సభ్యులు, గ్రామ యువజన సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రముఖులతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించారు.

'రైతు భరోసా'కు సర్వం సిద్ధం!

(5వ పేజీ తరువాయి)

తగ్గుతుంది. యాసంగికి, వర్షాకాలంకు వరిసాగు కూడా సుమారు 23ఎకరాల వరకు తగ్గుతుంది. ఇలాంటి సమస్యల్లో రైతుల్లో అపోహలకు రైతు భరోసా మార్గదర్శకాలు వస్తేగానీ, నిర్ధారించలేమని అధికారులంటున్నారు. గ్రామసభల్లో సాగు వివరాలను వెల్లడించి, రైతుభరోసా మార్గదర్శకాలకు అనుగుణంగా అందించడానికి అధికారులు కసరత్తును పూర్తి చేశారు.